# 105

# ‘కేసరి జీర్ణతృణంబు మేయునే’

అర్థశతాబ్దం క్రిందట ఇపుడున్నంత మంది దేశభక్తుల్లేరు. ఈపాటి దేశభక్తిలేదు. దేశసేవ చేదామన్న సత్సంకల్పంతో ఈనాడు ముందుకొస్తున్నంత మంది ప్రజా సేవకుల్లో వెయ్యోవంతు, లక్షోవంతు కూడా ఆనాడు లేరు.

కారణాలు మనకు తెలుసు. ‘దేశభక్తికి’ ఇపుడున్నంత గిట్టుబాటు అప్పుడు లేదు. ‘లీడర్’ అన్న ప్రతివాడూ, ఇపుడు ఏదో ఒక పదవిలో వుండి, తనివిదీరా ప్రజా సేవ చేస్తున్నాడు. తను తరిస్తున్నాడు. తన వారినీ తరింపచేస్తున్నాడు. అప్పుడలా కాదు మరి. దేశంపట్ల భక్తి చూపడం నేరం. రాట్నం వడకడం నేరం. ఖద్దరు కట్టుకోవడం నేరం. గాంధీ పేరు పలకడం నేరం. కల్లు తాగవద్దనడం నేరం. విదేశీ వస్తువుల్ని వాడవద్దనడం నేరం. ఈ నేరాలకు శిక్షలుకూడా దారుణంగానే వుండేవి.

ఖద్దరు కట్టుకొని, జైల్లో వున్నవారున్నారు. రాట్నం వొడికి లాఠీలతో చేతులు విరగ్గొట్టించుకున్న వారున్నారు. కల్లుపాకల దగ్గరా, సారా దుకాణాల దగ్గరా పికెటింగ్ చేసి, నెత్తురు మడుగుల్లో వోలలాడిన వారున్నారు. ఓ చెట్టుమీదో, గుట్టమీదో జాతీయ పతాకాన్ని ఎగరేసినందుకు చచ్చిపోయినవాళ్లూ వున్నారు. సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని, ఆస్తులన్నీ పోగొట్టుకున్న వారున్నారు. తమ సమస్తాన్నీ దేశ స్వాతంత్ర్యానికి అర్పితం చేసి ఈనాడు బికారులుగా బతుకుతున్నవారూ వున్నారు.

మీరాసాహెబుగారు, ఈ చివరి కోవకు చెందిన వ్యక్తి. మీరా కుటుంబానికి దేశభక్తికి సంబంధం లేదు. ఆయన తండ్రి మంచి సంగీత విధ్వాంసుడు. ఆయన చేతి కింద అయిదుగురు జనం హమేషా వుండేవారు. వారందరూ కలిసి పెళ్ళిళ్ళకు ‘తాసా మరబాద్’ వాయించేవారు. మీరా తండ్రి షె(హ)నాయ్ అద్భుతంగా వాయించేవాడు. తన కొడుకును కూడా తనంతవాణ్ని చేదామని ముసలాయన ఉబలాటం.

అంతో ఇంతో చదువుకొన్న మీరాకు, అక్షరంముక్క వంట బట్టలేదు. ఆయన గొంతులో సప్తస్వరాలు గుసగుసలాడుతుండేవి. గుండెల్లోంచి సంగీత ఝురి పెల్లుబుకుతుండేది. అదృష్టవశాత్తూ, మీరా గొంతు కమ్మగా కూడా వుంటుంది. తండ్రి శిక్షణలో మీరా సంగీతం నేర్చున్నాడు. తండ్రి బృందంతో పాటు పెళ్ళిళ్ళకూ హాజరవుతుండేవాడు.

ఉన్నవ లక్ష్మీనారాయణగారు, తమ శారదా నికేతనంలో వొక విధవా వివాహం తల పెట్టినప్పుడు ఊరి వారందరూ ఆయన్ను దాదాపుగా వెలివేశారు. అయినా ఉన్నవవారు లెక్క చేయలేదు. ఈ పెళ్ళిని శాస్త్రోక్తంగా జరిపించాలని ఉన్నవ వారి అభిప్రాయం. మరి పురోహితుడెలా? మేళతాళాలెలా? కవిరాజు రామస్వామి చౌదరిగారూ, ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులుగారూ మంచి స్నేహితులు, పౌరోహిత్యం జరిపించడానికి రామస్వామిగారు వొప్పుకున్నారు.

“ఆ పెళ్ళికి, మా నాన్న మేళం వాయించారండి. మా నాన్నతో పాటు నేనూ వెళ్ళాను. పెళ్ళిని ఆపు చేయడానికి ఊళ్ళోవాళ్ళు చాలా మంది సిద్ధంగా వున్నారు. అయినా ఎటువంటి ఇబ్బందులూ లేకుండానే పెళ్ళి జరిగిందనుకోండి” అన్నాడు మీరా.

అప్పుడే మీరాకు ఉన్నవ వారితో పరిచయం. తొలిసారిగా సహపంక్తి భోజనాలలో పాల్గొన్నది

కూడా అప్పుడేనన్నాడు మీరా. "మా వాడు బాగా పాడతాడండి! అని మా నాన్నగారు రామస్వామిగారితో అన్నారండి. చౌదరిగారు పాడమన్నట్లుగా సైగ చేశారు.

నేను రెండు మూడు పద్యాలు పాడాను. ఉన్నవవారు ఆశ్చర్యపోయారు. రామస్వామిగారు మెచ్చుకున్నారు." అన్నాడు మీరా. ఆ తరువాత ఉన్నవ వారి నుండి తరచుగా మీరాకు కబుర్లొస్తూ ఉండేవి. అక్కడెక్కడో మీటింగు ఏర్పాటు చేశామనీ, ఆ మీటింగులో పాడమనీ పంతులుగారు ఆనేవారు. మీరా సరేనంటూ పాడేవాడు.

"వీరగంధము తెచ్చినారము వీరులెవ్వరొ తెల్పుడీ" అన్న పాటను, మీరా పాడుతుంటే పైన పోతున్న పక్షులు కూడా ఆలకించేవట. "మామూలు జనంకన్నా, పోలీసులే ఆ మీటింగులకు ఎక్కువగా వచ్చేవారు బాబూ!వాళ్ళకూ నా పాటలంటే ఇష్టమే. నా ప్రార్థన అయిందాకా అక్కడక్కడా వుండి ఆ తరువాత, సభను చెదరగొట్టేవారు. ఒకసారి నన్నూ పట్టుకొన్నారు. రిమాండులో వుంచారు. నాచేత పాడించుకొని ఆ తరువాత చావబాదారు. మీరు పేరు విన్నారోలేదోగానీ డప్పుల సుబ్బారావని ఆ రోజుల్లో పరమ కిరాతకుడైన పోలీసాఫీసరు ఉండేవాడు. వాడికి పాపం పుణ్యం, దయ , దాక్షిణ్యం ఏ కోశానా లేవు... అమరావతిలో శివరాత్రికి బ్రహ్మాండంగా అమరేశ్వరస్వామి వారి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆ ఉత్సవాలకుగాను, కొత్తగా కల్లు అంగళ్ళు తెరిచారు. తెల్లాకుల జాలయ్యగారి నాయకత్వాన మేమంతా పికెటింగు చేస్తున్నాం. మాతోబాటు పదిమంది ఆడవాళ్ళు కూడా వున్నారు. సుబ్బారావు తన బలగంతో మా మీద దాడి చేశాడు. నాకూ, జాలయ్యగారికి చావు దెబ్బలు తగిలాయి. ఆడవాళ్ళ గాజులు బద్దలు కొట్టారు. పుస్తెలతాళ్ళు తెంచేశారు. జాతీయ జెండాను బూట్ల కాళ్ళతో, మట్టగించారు. చాలా మంది స్పృహ తప్పిపోయారు." అని ఆగిపోయాడు మీరా.

1942లో తెనాలి రైల్వే స్టేషన్ను ధ్వంసం చేసినవారిలో తనున్నదీ లేనిదీ మీరా చెప్పలేదు.

"ఇప్పుడా సంగతులన్నీ ఎందుకులెండి అబ్బాయిగారూ!" అని దాటవేశాడు మీరా.

స్వరాజ్యం వచ్చాక, దేశ స్వరూపంలో విచిత్రమైన మార్పులు చాలా చాలా వచ్చాయి. ఈ మార్పుల్ని చూసి, మీరా ఆశ్చర్యపోయాడు. ఒకప్పుడు త్యాగదీక్షతో, తమ సమస్తాన్నీ దేశమాత పాదాల వద్ద సమర్పించిన వ్యక్తుల్లో క్రమంగా ఆ ఉత్తర గుణం లుప్తమయిపోతున్నందుకు మీరా బాధపడ్డాడు.

"ఆశ్రయించితే నాకూ, ఏదో ఒకటి దొరికేది. నాకు తెలిసినవాళ్ళు ఇప్పుడు లేరనుకోండి. ఒకప్పుడు ప్రభుత్వంలో వుండేవాళ్ళు. ఆశ్రయించి, ఏదో ఒకటి లంకించుకొమ్మని ఉబ్బవేసిన వారూ వున్నారు. యాచించడం నాకిష్టంలేదు. అందులోనూ ఈ జనాన్ని ఆశ్రయించడం అసలే ఇష్టం లేదు. ఏం సంపాదించినా, వెంట ఏం వొస్తుంది గనుక? ఈ లుంగీ కూడా లాగేసి, పాత గుడ్డమీద కప్పి పారేస్తారు. ఆ భాగ్యానికి నీతి నియమాలు లేకుండా బతకాలా? నలుగురిచేతా ఛీ ఛీ అనిపించుకోవాలా?" అని ప్రశ్నించాడు మీరా. గడిచిన పదిహేను సంవత్సరాలుగా మీరా ఈ వృత్తిలోనే ఉంటున్నాడు. ఆయన ఇద్దరు కొడుకులూ దర్జీపని చేస్తున్నారు.

"ఏమీ వెనకేసుకోలేదు. అలా వేసుకోవాలన్న ఆబకూడా లేదు. ఓపికున్నంతవరకూ కష్టపడతాం. ఉన్నదేదో తింటాం.... నేను మాంసం తినను. నా పిల్లలూ తినరు. అవీ ఇవీ తాగరు. నాకున్న దురభ్యాసం చుట్టకాల్చడం. అదీ ఈ మధ్యనే అలవాటయింది. విపరీతంగా పళ్ళు సలుపుతాయ్.

చుట్టతాగితే మంచిదన్నారు. మంచిదో వల్లకాడోగానీ బాబుగారూ చుట్టమాత్రం నన్నొదిలి పెట్టనంటున్నది'' అన్నాడు మీరా.

ప్రస్తుత దేశ పరిస్థితుల్ని గురించి అడిగిన ప్రశ్నకు, మీరా సూటిగా సమాధానం చెప్పలేదు.

"తమరేదో అడిగారు గానీ, నా ఉద్దేశ్యం ఎవడిక్కావాలయ్యా నాయనా! మనం ఇంకేదన్నా మాట్లాడుకొందాం. నేను కుట్టిన పరుపులు చూడండి. పదేళ్ళు గ్యారంటీ ఇస్తా. దూదిముద్దకట్టదు. ఒక వేపుకు వుండచుట్టుకుపోదు. కుట్లు పిగలవు. మా పిల్లలు కూడా దర్జీపని బాగా చేస్తారు. రండి చూద్దురుగాని'' అని లేచాడు మీరా. అప్పుడెప్పుడో, ఏ వుద్యమంతోనూ, ఏ పోరాటంతోనూ ఏ మాత్రం సంబంధంలేని వారెంతో మంది, స్వాతంత్ర్య యోధులుగా, దేశభక్తులుగా, ప్రజా నాయకులుగా దేదీప్యంగా వెలిగిపోతున్నారు. ఎడాపెడా ఆర్జించుకొంటున్నారు. అవునుగదా!

అలాంటి వారిని చూసి, నేర్చుకుందామన్న కనీస జ్ఞానం కూడా మీరాలో కనిపించదు. బొత్తిగా చెల్లుబాటులో లేని నీతినీ, నిజాయితీని నమ్ముకొని, నానా అవస్థ పడుతున్నాడంటే మరి పడడా? ఇతన్ని చూసి జాలిపడడంకన్నా మనం మాత్రం ఏం చేయగలం కనుక!